సాక్షి
ప్రకాశం
సోమవారం । 3 । మార్చి । 2025



పేదలపై పీ-4 సర్వే పిడుగు

పీ–4 సర్వే పేరుతో సచివాలయ ఉద్యోగులు 27 రకాల ప్రశ్నలతో సర్వే చేస్తున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల్లో కోత పెట్టేందుకే సర్వే చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. - 8లో..



రేషన్ బియ్యం లారీల పట్టివేత

చీరాల నుంచి నెల్లూరు జిల్లాకు అక్రమంగా తరలిస్తున్న రెండు రేషన్ బియ్యం లారీలను నాగులుప్పలపాడు మండల అధికారులు పట్టుకున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

సోమవారం ఇఫ్తార్
సాయంత్రం గం 6 : 22

మంగళవారం సహెరి
ఉదయం గం 5 : 05

న్యూస్‌రీల్

16న మాలల కళాజాతర

ఒంగోలు వన్‌టౌన్: నగరంలోని నెల్లూరు బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ కళా ఆడిటోరియంలో ఈ నెల 16వ తేదీ మాలల కళాజాతర నిర్వహించనున్నట్లు దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు తెలిపారు. ఒంగోలు 13వ డివిజన్‌లోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. మాలల కళాజాతరలో రాష్ట్ర నలుమూలల నుంచి కళాకారులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలో లక్షలాది మంది మాలలు కళలపై ఆధారపడి జీవిస్తున్నారని, వీరిని ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. ఇప్పటి వరకూ వీరికి ప్రభుత్వం నుంచి ఎటువంటి పథకాలుగానీ, పెన్షన్లుగానీ అందడం లేదన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న మాలల కళాజాతరకు అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దండేల కృష్ణ, మురళి, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ పీవీ సునీల్ కుమార్ సస్పెన్షన్ అక్రమం

ఒంగోలు వన్‌టౌన్: సీనియర్ ఐపీఎస్ పీవీ సునీల్ కుమార్ సస్పెన్షన్ అక్రమమని, మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టీ అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీవీ సునీల్ కుమార్ సస్పెన్షన్‌ను రద్దు చేసి వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు.

పోస్టుల బేరం
కూటమి ఫలహారం

అంగన్‌వాడీ పోస్టులు అంగట్లో సరుకుల్లా మారాయి. అధికార కూటమి నాయకులు పోస్టుకో రేటు కట్టి బేరసారాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సెంటర్‌ను బట్టి వసూలు చేసి అమ్ముకుంటున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, వారి బంధువులు, పీఏలదే ఇందులో కీలక పాత్ర. వీరు ఓకే చెబితే అధికారులు ఆమోదముద్ర వేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనిలోపనిగా అధికారులూ తమ చేతివాటం చూపిస్తూ జేబులు నింపుకుంటున్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



- అంగట్లో అంగన్‌వాడీ పోస్టులు
- అమ్ముకుంటున్న కూటమి నాయకులు
- పోస్టుకు రూ.3 లక్షల పైగా వసూలు చేస్తున్న వైనం
- అధికారులు కూడా రూ.50 వేల నుంచి రూ.1.5 లక్షలు వసూలు చేస్తున్నట్లు సమాచారం
- ఎమ్మెల్యే పీఏ, బంధువుల కాల్‌తో కన్ఫర్మ్ చేస్తున్న అధికారులు
- లబోదిబోమంటున్న అర్హులు

ఒంగోలు సిటీ:

జిల్లాలో 38 మండలాల్లో 13 ఎస్‌సీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల కింద 2,903 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో అంగన్‌వాడీలు, హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ వర్కర్లకు సంబంధించి ఖాళీల భర్తీకి అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. 109 అంగన్‌వాడీ పోస్టులకు 283, వర్కర్ పోస్టులు 16కుగాను 74, 89 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకుగాను 200 దరఖాస్తులు వచ్చాయి. అలాగే నాలుగు మినీ అంగన్‌వాడీ పోస్టులకు సంబంధించి తొమ్మిది దరఖాస్తులు వచ్చాయి. ఇంత వరకూ ప్రక్రియ సజావుగా సాగింది. అధికార కూటమి నాయకులు రంగప్రవేశం చేశారు. పోస్టును బట్టి బేరాలు మొదలెట్టేశారు. అంతా బహిరంగంగా జరుగుతూనే ఉన్నా ఉన్నతాధికారులు కనీసం పట్టించుకున్న దాఖలాల్లేవు.

ఒక్కో పోస్టుకు మూడు లక్షల పైగా వసూలు..

ప్రభుత్వ పెద్దల దగ్గర నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో అధికార పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. డిమాండ్‌ను బట్టి రేటు నిర్ణయించారన్న ఆరోపణలు ఉన్నాయి. సెంటర్‌ను బట్టి ఒక్కో పోస్టుకు రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. హెల్పర్లకు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు మరో రేటు నిర్ణయించారు. ప్రధానంగా ఒంగోలు, మార్కాపురంలలో ముందుగా డబ్బులు చెల్లించిన వారికి సదరు నియోజకవర్గంలో ప్రజాప్రతినిధి లెటర్‌తో పాటు, పీఏ, వారి బంధువులు అధికారులకు ఫోన్ చేసి పలానా వారికి కన్ఫర్మ్ చేయండి అంటూ మౌఖిక ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలిసింది. ఇదంతా ఒక తంతు అయితే జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలోని సిబ్బంది కూడా మా సంగతి ఏమిటని అడుగుతున్నట్లు సమాచారం. వీరు కూడా పోస్టును బట్టి రూ.50 వేలు నుంచి రూ.లక్షన్నర వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మొక్కుబడిగా ఇంటర్వ్యూలు..

ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సంబంధించిన ఇంటర్వ్యూలను అధికారులు మొక్కుబడిగా నిర్వహించి మమ అనిపించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెల 14వ తేదీన ఒంగోలు నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఇచ్చిన లిస్టుల ఆధారంగానే ఎంపికలు జరిగినట్టు తెలిసింది. అలాగే నోటిఫికేషన్ ఇవ్వకుండానే కొన్ని కేంద్రాల్లో పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినట్టు సమాచారం. దర్శి నియోజకవర్గంలో అధికార టీడీపీ నాయకులు భారీగా డిమాండ్ చేసినట్టు తెలిసింది.

ఉన్నతాధికారులకు జాబితా..

మొక్కుబడిగా నిర్వహించిన ఈ ఇంటర్వ్యూల్లో క్వాలిఫైడ్ అభ్యర్థుల జాబితాను ఉన్నతాధికారులకు పంపించారు. త్వరలో ఫలితాలు వెలువడనున్నాయి. చిన్నారులు, బాలింతల బాగోగులు చూసే అత్యంత కీలకమై అంగన్‌వాడీ పోస్టులను ఇలా అంగట్లో సరుకులా మార్చేయడం సరికాదని, అర్హులకు కాదని పైరవీకారులకు కట్టబెడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికే నిర్వహించిన ఇంటర్వ్యూలను రద్దు చేసి అర్హులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

డివిజన్ల వారీగా ఖాళీల వివరాలు ఇలా...

ఒంగోలు డివిజన్:	పోస్టులు	దరఖాస్తులు
అంగన్‌వాడీ వర్కర్లు	06	34
అంగన్‌వాడీ హెల్పర్లు	45	106
కనిగిరి డివిజన్:		
అంగన్‌వాడీ వర్కర్లు	06	30
అంగన్‌వాడీ హెల్పర్లు	20	42
మినీఅంగన్‌వాడీ వర్కర్లు	01	02
మార్కాపురం డివిజన్:		
అంగన్‌వాడీ వర్కర్లు	04	10
అంగన్‌వాడీ హెల్పర్లు	24	52
మినీఅంగన్‌వాడీ వర్కర్లు	03	09

చంద్రబాబుది రాజ్యాంగ ఉల్లంఘన

- వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి



కె.వి.రమణారెడ్డి

ఒంగోలు సిటీ: ప్రజాస్వామ్య విలువలు కాపాడాల్సిన రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధ్యతా రహితంగా ప్రకటనలు చేయడం సరికాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి విమర్శించారు. శనివారం చిత్తూరు జిల్లాలో పర్యటించిన చంద్రబాబు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఏ ఒక్క పనీ చేయకూడదని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం సరికాదని మండిపడ్డారు. ఆదివారం కె.వి.రమణారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికలప్పుడే రాజకీయాలు అని, తర్వాత కులం, మతం, పార్టీలు చూడమంటూ అర్హులందరికీ తన పాలనలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి న్యాయం చేశారన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు బహిరంగ సభల్లో చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే ఆయన ఆ పదవికి ఏమాత్రం అర్హుడు కాదనిపిస్తోందన్నారు. కేవలం ఒకే ఒక్క వర్గానికి న్యాయం చేయాలనుకోవడం సరికాదన్నారు. నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే ముఖ్యమంత్రి చేస్తున్న ప్రకటనలు సరికాదన్నారు. గత ఎన్నికల్లో నలభై శాతం మంది ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారని, ఇప్పుడు వారిని ద్వితీయ శ్రేణి పౌరులుగా చూడటం రాజ్యాంగాన్నే అవమానించినట్లని విమర్శించారు. మీరు ఒక ప్రాంతానికో, ఒక కులానికో, ఒక మతానికో నాయకులు కాదని ప్రజలందరూ ఎన్నుకుంటేనే మీరు ముఖ్యమంత్రి అయ్యారనే విషయాన్ని ఆలోచించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తూ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న మీరు ఆ పదవిలో ఒక్క నిమిషం కూడా ఉండటానికి అర్హత లేదన్నారు.

నల్లమల..
వన్యప్రాణుల ఖిల్లా



నల్లమలలో ఆకాశంలో సంచరించే క్రస్టెడ్ హాక్ ఈగల్

ప్రకృతి అందాలకు నల్లమల అటవీ ప్రాంతం ఆలవాలమైంది. ఎటు చూసినా ఆకాశాన్నంటే చెట్లు, బెబ్బులి గర్జనలు, నెమళ్ల నాట్యాలు, అరుదైన పక్షుల కిలకిలా రావాలు, అటు నుంచి ఇటు పరిగెత్తే జింకలు, సెలయేళ్లు, పర్యాటక ప్రదేశాలకు నల్లమల అటవీ ప్రాంతం నెలవుగా మారింది. ప్రతి ఏడాది మార్చి 3న ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని నిర్వహిస్తుంటారు. ప్రజలకు వన్యప్రాణుల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు.









- ప్రకృతి అందాలకు నిలయం నల్లమల
- అభయారణ్యంలో 87కు పైగా పెద్ద పులులు
- 400 కు పైగా చిరుతలు, దుప్పులు, జింకలు
- అరుదైన పక్షిజాతులు, వృక్ష సంపద
- నేడు వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం

మార్కాపురం:

నల్లమల అటవీ ప్రాంతం ప్రకాశం, గుంటూరు, కర్నూలు జిల్లాల పరిధిలో సుమారు 6.50 లక్షల హెక్టార్లలో విస్తరించి ఉంది. ఈ అటవీ ప్రాంతంలో 87కు పైగా రాయల్ బెంగాల్ టైగర్లు, సుమారు 400 కు పైగా చిరుతలు తిరుగుతున్నాయి. వీటితోపాటు వందల సంఖ్యలో దుప్పులు, జింకలు, నీల్‌గాయ్‌లు, ఎలుగుబంట్లు ఉన్నాయి. వీటితోపాటు ఆకాశంలో 4 నుంచి 5 కిలో మీటర్ల ఎత్తులో తిరుగుతూ క్షణాల్లో భూమిమీద తిరిగే వన్యప్రాణులను తినే అరుదైన క్రస్టడ్ హాక్ ఈగల్ (నల్లపాముల గద్ద), షార్టు టోడోస్ స్నేక్‌ఈగల్, హనీబజర్, క్రస్టడ్ సర్పెంట్ ఈగల్‌లు సంచరిస్తున్నాయి. ఇక రష్యా నుంచి 8 వేల కిలోమీటర్లు ప్రయాణించి నల్లమలకు వచ్చే మాన్‌టెగ్యూష్ హారియర్, పాలిడ్ హ్యారియర్ తదితర పక్షులకు కూడా నల్లమల ప్రాంతం నివాసంగా మారింది.

మార్కాపురానికి చుట్టుపక్కల నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పెద్దదోర్నాల, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, పెద్దారవీడు, అర్ధవీడు, గిద్దలూరు తదితర మండలాల్లో అటవీ సమీప గ్రామాలున్నాయి. పెద్దదోర్నాల మండలంలోని నల్లగుంట్ల, వై చర్లోపల్లి, తుమ్మలబైలు, శ్రీశైల శిఖరం, బొమ్మలాపురం, ఘాట్‌రోడ్డు, అర్ధవీడు మండలంలోని వెలగలపాయ, మాగుటూరు తాండ, గన్నెపల్లి, లక్ష్మీపురం, దొనకొండ, మార్కాపురం మండలం గొట్టిపడియ, పెద్దారవీడు మండలం గుండంచర్ల తదితర గ్రామాల సమీపాల్లోకి వన్యప్రాణులు తరచుగా వస్తుంటాయి. ముఖ్యంగా పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, నెమళ్లు సంచరిస్తున్నాయి. అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల సంరక్షణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారు. పెద్దపులులు, చిరుతలకు అడవిలోనే నీటి సమస్య లేకుండా సోలార్ సాసర్‌పిట్‌లు ఏర్పాటు చేసి అధికారులు నీటి సమస్య తీర్చారు.

నల్లమల పరిధి పెరిగిపోతోంది. గతంలో ఏపీలోని ప్రకాశం, గుంటూరు, కర్నూల్, తెలంగాణలోని మహబూబ్‌నగర్, నల్గొండ తదితర జిల్లాలతో అనుసంధానంగా ఉండగా ఇప్పుడు శేషాచలం అడవులను కలుపుతూ ఎన్‌ఎస్‌టీఆర్ (నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు), శేషాచలం అడవులను కలిపి టైగర్ కారిడార్ ఏర్పాటైంది. నల్లమల అడవిలోని పెద్దపులులు కడప మీదుగా వనిపెంట, ఒంటిమిట్ట తదితర ప్రాంతాల్లో ఉన్న శేషచలం అడవుల్లో కూడా సంచరిస్తున్నాయి. దీంతో నల్లమల పరిధి 8 వేల చదరపు కిలోమీటర్ల నుంచి 16 వేల చదరపు కిలోమీటర్లకు విస్తరించింది.

పులుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సుమారు 1000 మంది సిబ్బందిని, 85 బేస్ క్యాంపులను ఏర్పాటు చేశారు. పులుల సంరక్షణకు తీసుకునే చర్యల వలన పులుల సంఖ్య పెరగడం విశేషం.

ఆకట్టుకుంటున్న జంగిల్ సఫారీ..

దోర్నాల నుంచి శ్రీశైలం మధ్య అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జంగిల్ సఫారీ పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జంగిల్ సఫారీని చూడొచ్చు. అటవీశాఖాధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో నల్లమల అటవీ ప్రాంతంలో సుమారు 25 కిలోమీటర్ల వరకూ ప్రయాణించవచ్చు. జింకలు, నెమళ్లు, పలురకాల పక్షిజాతులు కనిపిస్తాయి. ఇందులో పులికుంట వద్ద వ్యూ పాయింట్ వద్ద కాసేపు వాహనాన్ని ఆపుతారు. పెద్దపులులు, చిరుతలు ఇక్కడికి తరచుగా వచ్చి నీళ్లు తాగుతాయి. ఇక కొండ చిలువలు, పెద్ద పెద్ద చెట్లకు చుట్టుకుని కనిపిస్తాయి.



హనీ బజర్డ్ పక్షి

జంగిల్ సఫారీ అద్భుతం

నల్లమల అటవీ ప్రాంతంలో దోర్నాల నుంచి శ్రీశైలం మధ్యలో అటవీశాఖ వారు ఏర్పాటు చేసిన జంగిల్ సఫారీ చాలా అద్భుతం. విజ్ఞానంతో పాటు వినోదాన్ని కూడా అందిస్తుంది. ప్రతి ఒక్కరూ సెలవు రోజుల్లో పిల్లలను తీసుకుని జంగిల్ సఫారీకి వెళితే అన్నీ రకాల వన్యప్రాణులను మనం చూడవచ్చు.

– జీఎల్ రమేష్‌బాబు, టీచర్ మార్కాపురం

అరకొర నిధులతో వెలుగొండను ఎలా పూర్తి చేస్తారు?



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు

- జిల్లా ప్రజలను నిర్లక్ష్యం చేసిన బడ్జెట్
- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు

కొండపి: వెలుగొండ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా గుర్తించి 2027 కల్లా పూర్తి చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం బడ్జెట్లో అరకొరా నిధులు కేటాయించి ప్రకాశం జిల్లా ప్రజల ఆశల మీద నీళ్లు చెల్లిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు విమర్శించారు. మండల కేంద్రమైన కొండపి బస్టాండ్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై నిరసన ఆదివారం వ్యక్తం చేశారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి కావడానికి సుమారు రూ.4 వేల కోట్లు అవసరమవుతాయని, రూ.1458 కోట్లతో మొదటి దశ 2027 నాటికి పూర్తి చేస్తామని వెలుగొండ ప్రాంతంలో పర్యటించిన నీటిపారుదల శాఖ మంత్రి ఇటీవల ప్రకటించారని అన్నారు. బడ్జెట్లో పాలేటిపల్లె రిజర్వాయర్, సంగమేశ్వరం ప్రాజెక్టు, ప్రస్తావనే లేదని, దొనకొండ కారిడార్ కనిగిరి నిమ్స్, ఒంగోలు విమానాశ్రయం, పరిస్థితి ఏమిటి అనేది ప్రభుత్వం ప్రస్తావించలేదని అన్నారు. ఏ పంటకు గిట్టుబాటు ధర లేని స్థితిలో రైతులుంటే కేవలం రూ.300 కోట్లతో ధరల స్థిరీకరణ ఎలా సాధ్యమని పంటల పండగ ఎలా చేస్తారని ఆయన విమర్శించారు. మెగా డీఎస్సీ కలగా మారిందని, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, మహాలక్ష్మి పథకం లాంటి ఎన్నికల నాటి పథకాలన్నీ కనుమరుగు చేసేలా బడ్జెట్ ఉందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కేజీ మస్తాన్, జిల్లా నాయకురాలు కంకణాల రమాదేవి, వి.మోజస్, మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, బ్రహ్మయ్య, చిన్న పేతురు, బ్రహ్మయ్య, వందనం, పెద్ద పేతురు, నిర్మల, ప్రేమ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం స్టీరింగ్ కమిటీ ఏర్పాటు

- సమన్వయకర్తగా పఠాన్ కరిముల్లా ఖాన్

ఒంగోలు వన్‌టౌన్: ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కోసం ముస్లిం స్టీరింగ్ కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. ఒంగోలు బండ్లమిట్టలో ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్‌డీ సర్దార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ముస్లిం నాయకులు మాట్లాడుతూ ముస్లిం హక్కుల సాధన కోసం, సమస్యల పరిష్కారానికి నగరంలోని ముస్లింలు అందరూ ఒకే తాటిమీదకు వచ్చి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఒంగోలు నగరంలో సుదీర్ఘకాలంగా పరిష్కారం కాని ముస్లిం శ్మశాన వాటిక, షాదీఖానా నిర్వహణ, ఉర్దూ పాఠశాల ఏర్పాటు వంటివి పరిష్కారం కాకుండా ఉన్నాయన్నారు. ముస్లింలకు న్యాయంగా అందాల్సిన సంక్షేమం, రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం, హక్కుల సాధన కోసం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటులో ప్రధాన ఉద్దేశం అని అన్నారు. నగరంలోని 50 డివిజన్ల పరిధిలోని ముస్లింలందరినీ చైతన్య పరిచి యాక్షన్ కమిటీ ఏర్పాటు కోసం స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. సభ్యులుగా ప్రజా సంఘాల నాయకులు ఎస్‌డీ ఇస్మాయిల్, ఎండీ రఫీ అహ్మద్, ఎస్‌కే అబ్దుల్ రవూఫ్, మహ్మద్ రఫీ, ఎస్‌డీ హుస్సేన్, ఎస్‌డీ కరీముల్లా, ఎంప సాలార్, ఎస్‌డీ ఇలియాజ్‌లను వ్యవహరిస్తారు. సలహాదారులుగా ఎస్‌డీ సర్దార్, ఎస్‌కే కరీముల్లా, ఎస్‌కే మహబూబ్ భాయ్‌లు వ్యవహరిస్తారు. కార్యక్రమంలో ఎస్‌కే షబ్బీర్, ఎస్‌కే కరీం, ఎస్‌కే ఖాదర్ వలి, ఎస్‌డీ సలీం, ఎస్‌కే గౌస్ భాషా, ఎస్‌కే ఫయాజ్, ఎస్‌డీ సమద్, పఠాన్ గౌస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం స్టీరింగ్ కమిటీ

ఆ పిల్లలకు దిక్కెవరు..!

- విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి
- ఏడాది క్రితం తల్లి మృతి
- అనాథలైన నలుగురు పిల్లలు


కోటేశ్వరరావు(ఫైల్)

పుల్లలచెరువు: విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పిడికిటివాని పల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన దండేబోయిన కోటేశ్వరరావు(38) ఉపాధి హామీ పథకంలో ఆపరేషటర్‌గా పనిచేస్తూ ఉన్న దానిట్లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని తనకు ఉన్న నలుగురు పిల్లలను చదివించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కోటేశ్వరరావు భార్య ఏడాది క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి అన్ని తానై పిల్లలను చూసుకుంటున్నాడు. విధి చిన్న చూపు చూడడంతో శనివారం రాత్రి సమయంలో ప్లాంట్ రిపేరు రావడంతో కోటేశ్వరరావు తనకు ఉన్న పరిజ్ఞానంతో రిపేరు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పక్క ఇళ్లవారు వచ్చి చూసే సరికి మృతి చెంది ఉండడంతో వారి పిల్లల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం ఒక్కసారిగా మార్మోగింది. కోటేశ్వరరావు ఇటీవల వరకు పుల్లలచెరువులో పనిచేసి ఇటీవలనే యర్రగొండపాలెం కార్యాలయానికి బదిలీపై వెళ్లాడు. అందరికీ పరిచయమైన వ్యక్తిగా మంచి పేరు సంపాదించుకున్న కోటేశ్వరరావు మృతితో చిన్నారులు అనాథలుగా మిగిలారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పుచ్చలమిట్టలో చోరీ


బెడ్‌పై చిందరవందరగా ఉన్న వస్తువులు


తాళం తీసి ఉన్న బీరువా

దర్శి(కురిచేడు): స్థానిక పుచ్చలమిట్టలోని త్రిపురాభట్ల పున్నయ్యశాస్త్రి ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే..పుచ్చలమిట్టకు చెందిన పున్నయ్యశాస్త్రి కుటుంబసభ్యులు వేసవి కాలం కావడంతో వరండాలో నిద్రిస్తున్నారు. బెడ్‌రూంకు, వరండాలకు వేర్వేరు దారులు ఉన్నాయి. ఉదయాన్నే నిద్ర లేచి చూసేసరికి బెడ్‌పై దుస్తులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువా తాళాలు తీసి ఉండటంతో పరిశీలించగా..అందులోని 13 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు గుర్తించారు. అయితే ఈ ఇంట్లో చోరీ తరువాత దుండగలు మరో ఇంట్లో చోరీకి తాళాలు పగులగొడుతుండగా చుట్టుపక్కల వారు నిద్ర లేవడంతో దొంగలు పరారయ్యారు.

పేదల పై పీ-4 సర్వే పిడుగు

- 27 రకాల ప్రశ్నలతో సచివాలయ ఉద్యోగుల సర్వే
- ఇంటిలోని విలువైన వస్తువుల వివరాల నమోదు
- చడీచప్పుడు లేకుండా సాగుతున్న సర్వే
- సంక్షేమ పథకాల లబ్ధిదారుల కోత కోసమేనా ?



బేస్తవారిపేట సచివాలయం

బేస్తవారిపేట: కూటమి నేతలు సూపర్ సిక్స్ అంటూ గత ఎన్నికల ప్రచారంలో ఉదరగొట్టారు. ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ మీ ఇంటికి ఇన్ని పథకాలు వస్తాయి..ఇంత మేలు జరుగుతుందంటూ నమ్మించారు. కూటమి అధికారంలోకి వస్తే మీ జీవితాలు మెరుగుపడతాయన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక తొమ్మిది నెలలవుతున్నా వీటి అమలుకు నోచుకోలేదు. చెప్పిన వాగ్దానాలు అమలు చేయకుండా సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. తాజాగా పీ-4 సర్వే పేరిట ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తేసేందుకు శ్రీకారం చుట్టారు.

పీ-4 సర్వేలో భాగంగా సచివాలయ ఉద్యోగులు ప్రజలకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. టీవీ, ఏసీ, ఫోర్ వీలర్, టూ వీలర్, ఇతర గృహోపకరణాలు, ఇళ్ల స్వరూపం, లేకులా, స్లాబా, బ్యాంక్ ఖాతా.... ఇలా 27 రకాల ప్రశ్నలు అడిగి సమాధానాలను సిబ్బంది నింపాల్సిన పరిస్థితి. ఆపై ప్రజల ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నమోదు చేసి ఈ తతంగాన్ని ముగిస్తున్నారు. జిల్లాలో 1392 రేషన్ దుకాణాల పరిధిలో 6.73 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వేల కుటుంబాలు కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. వీరంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలే. అప్పోసప్పో చేసి, నెలవారీ వాయిదాల్లో ఏసీలను ఎక్కువ మంది ఏర్పాటు చేసుకుని ఉంటారు. అయితే ఇది ఉందని తెలిస్తే చాలు వెంటనే సదరు వివరాలను ప్రభుత్వ రికార్డుల్లోకి సిబ్బంది నమోదు చేస్తున్నారు. ఈ వ్యవహారంతో తమకు సంక్షేమ పథకాలు ఆగిపోతాయనే ఆందోళన పేదల్లో నెలకొంది.

నిరాకరించినా..నమోదే...

సర్వేలో సిబ్బంది పొందుపర్చే అంశాలు ప్రస్తుత జీవనశైలిలో భాగమైనవే. స్మార్ట్‌ఫోన్‌లు, బైక్‌లు ఇలాంటి ప్రశ్నలు ఉండటంతో సంక్షేమ పథకాల్లో కోత పడుతుందనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. సర్వేకు ఎవరైనా నిరాకరిస్తే వారి పేర్లను సైతం నమోదు చేయాలనే ఆదేశాలు సిబ్బందికి జారీ చేయడం కలవరానికి గురిచేస్తోంది.

బాబూ నమ్మండయ్యా..

పీ-4 సర్వేను పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్‌తో నిర్వహిస్తున్నారు. దీన్ని నమ్మాలని అధికారులు ప్రజలను కోరుతున్నారు. జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో ఉన్న కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. ఇంటి వద్దకు సిబ్బంది వెళ్లి వివిధ రకాల సమాచారాన్ని సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని చెబుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల గుర్తింపు కోసం ఇది దోహదపడుతుందనే అంశాన్ని ప్రజలకు తెలియజేయాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి అధికారులు చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు యథావిధిగా కొనసాగుతాయని, ఇందులో ఎలాంటి అపోహలొద్దని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అంతా అయోమయం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

మద్దిపాడు: రోడ్డు ప్రమాదంలో శనివారం గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. బాపట్ల జిల్లా అద్దంకి పట్టణానికి చెందిన తాటి అజయకుమార్, అతని తల్లి పుష్పావతి ద్విచక్ర వాహనంపై అద్దంకి వెళ్తుండగా జాతీయ రహదారిపై మద్దిపాడు మండలంలోని ఏడుగుండ్లపాడు సమీపంలో మార్కెట్ యార్డ్ వద్ద వెనుక నుంచి ఇసుజు వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన తాటి పుష్పావతి ఒంగోలులో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు మద్దిపాడు పోలీసులు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో పోస్టాఫీసుల ఉనికి


మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు అజయ్‌కుమార్

ఒంగోలు టౌన్: కేంద్ర ప్రభుత్వ వైఖరి కారణంగా పోస్టాఫీసుల ఉనికి ప్రమాదంలో పడిందని , కార్మికుల భవిష్యత్‌ను కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. తపాలా శాఖలో జరుగుతున్న పెను మార్పులపై సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అజయ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు తపాలా శాఖను సేవారంగంగా పరిగణించాయని, ప్రస్తుత ప్రభుత్వం అందుకు విరుద్ధంగా తపాలా శాఖను వ్యాపార సంస్థగా మార్చి వేస్తుందన్నారు. రానున్న రోజుల్లో తపాలా శాఖను మూడు విభాగాలుగా విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మెయిల్ డెలివరీ విభాగాలుగా తపాలా శాఖను విడగొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని, దీని వల్ల తపాలా ఉద్యోగులు, కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు తపాలా కార్మికులు ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతో ఉందని చెప్పారు. సదస్సులో ఎన్‌ఈపీఈ జిల్లా కార్యదర్శి ఏ.హరిబాబు, ఏఐజీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం. పోలయ్య, మహిళా నాయకులు డి. శ్రీలక్ష్మి, కె.ప్రసన్న, జీవీ సుబ్బారావు, కొప్పోలు వెంకటేశ్వరరావు, దర్శి మోహన్‌రావు, పాతం శెట్టి పేరయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, జి.శ్రీనివాసులు, దామా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం లారీలు పట్టివేత


పట్టుకున్న రేషన్ బియ్యం లారీలతో అధికారులు

నాగులుప్పలపాడు: చీరాల నుంచి నెల్లూరు జిల్లాకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు లారీలను ఆదివారం నాగులుప్పలపాడు సమీపంలో అధికారులు పట్టుకున్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతుందన్న సమాచారంతో ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. నాగులుప్పలపాడు సమీపంలోని ఇంకొల్లు క్రాస్ రోడ్డు వద్ద ఏపీ 39 టీయూ 1015, ఏపీ 39 టీయూ 4972 నంబర్ల గల లారీలను తనిఖీ చేయగా, ఒక్కో లారీలో 350 చొప్పున 50 కేజీల రేషన్ బియ్యం బస్తాలు ఉన్నాయి. మొత్తం 700 బస్తాలున్నట్లు గుర్తించి వాహన డ్రైవర్లు అరవపల్లి గోపి, ఇమ్రాన్ నుంచి వాంగ్మూలం సేకరించారు. ఈ బియ్యంను నెల్లూరు జిల్లా కావలికి చెందిన వంశీరెడ్డి, వాహన ఓనర్ శామ్యూల్, మాల్యాద్రి అక్రమంగా సేకరించి రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిపై నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయించినట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన 700 బస్తాల రేషన్ బియ్యంను ఒంగోలు ఎంఎల్‌ఎస్ గోడౌన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ రాఘవరావు, ఎస్సై నాగేశ్వరరావు, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురాంతకేశ్వరుడి ఆదాయం రూ.12.82 లక్షలు


హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది, సేవాసమితి సభ్యులు

త్రిపురాంతకం: పార్వతీ త్రిపురాంబ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరీ దేవి ఆలయాల హుండీ ఆదాయం రూ.12,82,579 వచ్చినట్లు ఆలయాల కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారి తెలిపారు. స్వామివారి దేవస్థానం హుండీలో రూ.7,88,736, అమ్మవారి దేవస్థానం హుండీలో రూ.4,59,781, అన్నదానం హుండీలో రూ.34,062 వచ్చినట్లు పేర్కొన్నారు. హుండీలను చీఫ్ ఫెస్టివల్ అధికారి డి.అనిల్‌కుమార్, ఆలయాల కమిటీ చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు, ధర్మకర్తల మండలి సభ్యులు, బాలా త్రిపుర సుందరీ, భ్రమరాంబ సేవా సమితీల ఆధ్వర్యంలో లెక్కించినట్లు పేర్కొన్నారు.

చిరుత పులి కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

యర్రగొండపాలెం: అటవీ జంతువుల కోసం ఉచ్చులు వేసి చిరుత పులి మరణానికి కారణమైన ఇద్దరు నిందితులను అటవీ శాఖాధికారులు ఆదివారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..గత నెల 15వ తేదీ రాత్రి కొలుకుల సెక్షన్‌లోని వరదరాజు స్వామి గుడి ప్రాంతంలో అటవీ జంతువులను వేటాడటానికి మండలంలోని పెద్ద కొలుకుల గ్రామానికి చెందిన దొంత రామయ్య, దొంత యల్లయ్యలు ఉచ్చులు వేశారు. ఈ ఉచ్చులో చిరుత పులి చిక్కుకుంది. తప్పించుకునే వీలు లేక పోవడంతో మరుసటి రోజు ఆ పులి మృతి చెందింది. ఈ కేసు ముమ్మరం చేసిన ఫారెస్ట్ అధికారులు డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీను సేకరించి నిందితులను గుర్తించి వారితో పాటు అనుమానితులైన మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అరెస్ట్ అయిన మొదటి నిందితుడు రామయ్య ఇంటి వద్ద 3కణితి కొమ్ములు, 2చుక్కల దుప్పి కొమ్ములు, 2 సెల్‌ఫోన్‌లు, కత్తి, టార్చ్‌లైట్, మోటారు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వారు పేర్కొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్ సీజ్

మద్దిపాడు: మండలంలోని సీతారాంపురం కొష్టాల సమీపంలో వేసిన వెంచర్‌కు ఎటువంటి రసీదులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్‌ను మద్దిపాడు పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. అనధికారికంగా గ్రావెల్ తరలిస్తున్నారన్న సమాచారంతో మద్దిపాడు పోలీసులు తనిఖీ చేసి సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్ అధికారులకు లేఖ రాసినట్లు ఎస్‌ఐ శివరామయ్య తెలిపారు.

యోగాతో ఒత్తిడి దూరం


యోగా చేస్తున్న మహిళా పోలీసులు


మాట్లాడుతున్న ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు

ఒంగోలు టౌన్: నిత్యం మానసిక ఒత్తిడికి గురయ్యే మహిళా పోలీసులు యోగా ద్వారా ఉపశమనం పొందవచ్చని ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు సూచించారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండడమే కాకుండా మానసికంగా కూడా ధృఢంగా వుంటారని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కళ్యాణ మండపంలో మహిళా పోలీసులకు యోగా నిర్వహించారు. ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరూ పని ఒత్తిడికి గురవుతున్నారని, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు మానసిక ఒత్తిడితో సతమతమవుతున్నారన్నారు. మెడిటేషన్, యోగాలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, జీవితంలో విజయం సాధించడానికి ఉపయోగపడతాయన్నారు. మానసిక భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం ద్వారా అన్ని రంగాల్లో విజయం సాధించడం సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ సీతారామిరెడ్డి, యోగా గురువు బాలు, మహిళా పోలీసులు, హోంగార్డులు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

వితంతు పింఛన్ కోసం పది నెలలుగా పడిగాపులు

- సోషల్ మీడియాలో టీడీపీ కార్యకర్త పోస్టు వైరల్


పింఛన్ రాలేదని భర్త డెత్ సర్టిఫికెట్ చూయిస్తున్న మహిళ

కంభం: 'నా భర్త చనిపోయి ఏడాది కావస్తుంది. వితంతు పింఛన్ కోసం పది నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా మంజూరు కాలేదు. మేం తొలి నుంచి టీడీపీ కార్యకర్తలం' అంటూ స్థానిక కందులాపురం పంచాయతీలో హైవేరోడ్డుపై చిన్న బంకు పెట్టుకొని జీవనం సాగిస్తున్న షేక్ కరీమున్నిసాపై సోషల్ మీడియా పోస్టు వైరల్‌గా మారింది. అయితే ఆ పోస్టు గమనించిన టీడీపీ మండల అధ్యక్షుడు ప్రస్తుతం ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి లేదని, అందుబాటులోకి వెంటనే పింఛన్ మంజూరవుతుందంటూ మరో పోస్టు సోషల్ మీడియాపై పెట్టారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా పింఛన్లు, రేషన్‌కార్డులకు సంబంధించి వెబ్‌సైట్ పోర్టల్ అందుబాటులోకి తీసుకురాలేదని, దీంతో ఎంతో మంది లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు.

క్రికెట్ బుకీలు జంప్

- జరుగుమల్లి యువకుడు పరారీతో బట్టబయలైన బెట్టింగ్ బాగోతం
- పోలీసుల అదుపులో క్రికెట్ బుకీలు?
- క్రికెట్ బెట్టింగ్‌పై విచారణ వేగవంతం చేసిన పోలీసులు


సింగరాయకొండలోని కందుకూరు ఫ్లై ఓవర్ సెంటర్‌లో జనం నామమాత్రంగా ఉన్న దృశ్యం

సింగరాయకొండ: క్రికెట్ బెట్టింగ్‌లో జరుగుమల్లి మండలం పైడిపాడు గ్రామానికి చెందిన యువకుడు బత్తిన అశోక్ నగదు పోగొట్టుకుని ఇంటి నుంచి పరారైన ఘటనతో క్రికెట్ బెట్టింగ్ భూతం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారం జరుగుమల్లి, సింగరాయకొండ మండలాల్లోని క్రికెట్ బుకీల వెన్నులో దడపుట్టించింది. ఈ వ్యవహారం ఎస్పీ ఏఆర్ దామోదర్ దృష్టికి వెళ్లటంతో ఆయన ఆదేశాలతో ఈ కేసు విచారణను పోలీసులు వేగవంతం చేయటంతో క్రికెట్ బుకీలు జంప్ అయ్యారన్న ప్రచారం సాగుతోంది. పూర్తి వివరాల ప్రకారం... పైడిపాడు గ్రామానికి చెందిన అశోక్ క్రికెట్ బెట్టింగులు ఆడి భారీగా డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో క్రికెట్ బుకీలకు డబ్బులు కట్టలేక ఇంట్లో చెప్పలేక చివరకు ఈ నెల 20వ తేదీ ఉదయం హెయిర్ కటింగ్ చేయించుకుని వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో అతను చివరిసారిగా ఆ గ్రామానికి చెందిన క్రికెట్ బుకీ తన్నీరు తేజతో ఫోన్ మాట్లాడినట్లు తెలుసుకున్న అశోక్ బంధువులు జరుగుమల్లి పోలీస్‌స్టేషన్‌లో గత నెల 21వ తేదీ ఫిర్యాదు చేశారు. దీంతో ఆ మండలంలో జరుగుతున్న బెట్టింగ్ విషయం బట్టబయలైంది. ఈక్రమంలో అశోక్ బంధువులు ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను కలిసి అశోక్ పారిపోవటానికి గల కారణాలను వివరించారు. గత నెల 23వ తేదీ సాయంత్రం అశోక్ తన బంధువులకు ఫోన్ చేసి మీరు భయపడవద్దని తాను తిరుపతి సమీపంలో ఉన్నానని ఇంటికి వస్తున్నానని చెప్పి మరుసటి రోజు ఇంటికి తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో జరుగుమల్లి పోలీసులు అశోక్ ను తహశీల్దార్ వద్ద హాజరు పరచి అతను ఇంటి నుంచి వెళ్లిపోవటానికి గల కారణాలను రాత పూర్వకంగా నమోదు చేశారు. తరువాత పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టారు. సీఐ హజరత్తయ్య పర్యవేక్షణలో జరుగుమల్లి ఎస్సై బీ మహేంద్ర ఆధ్వర్యంలో విచారణ సాగుతున్నట్లు సమాచారం. రెండు రోజులుగా పోలీసులు జరుగుమల్లి, సింగరాయకొండ మండలాల్లో క్రికెట్ బుకీల కోసం వేట మొదలు పెట్టి సుమారు 15 మంది వరకు బుకీలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారన్న ప్రచారం జోరుగా ఉంది. వీరిలో ప్రధానంగా సింగరాయకొండ కు చెందిన రెస్టారెంట్ యజమాని, అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి ఉన్నాడని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో పోలీసులపై అధికార పార్టీ నాయకుల ఒత్తిడి తీవ్రమైంది. ఇటీవల ఐసీసీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైనప్పటి నుంచి కందుకూరు ఫ్లైఓవర్ జంక్షన్ బెట్టింగు రాయుళ్లకు అడ్డాగా మారిందని, ఆ ప్రాంతంలోని హోటళ్ల వద్ద కూర్చొని బెట్టింగ్ ఆడుతున్నారని సమాచారం. ఇటీవల కాలంలో తమ పిల్లలు లక్షలకు లక్షలు బెట్టింగులో పోగొట్టుకుంటున్నారని, ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థం కాలేదని ఇకనైనా బెట్టింగు జాడ్యానికి పోలీసులు ముగింపు పలకాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆదివారం ఇండియా- న్యూజిలాండ్ మ్యాచ్ జరుగుతున్నా కందుకూరు ఫ్లై ఓవర్ జంక్షన్ ప్రాంతం బోసిపోయింది. క్రికెట్ బుకీలు ఇతర రాష్ట్రాలకు పరారై తలదాచుకుంటున్నారు. దీనిపై సీఐ హజరత్తయ్యను వివరణ కోరగా...అనుమానితులను విచారిస్తున్నామని, ఎవ్వరినీ అదుపులోనికి తీసుకోలేదని తెలిపారు.

50 ఏళ్ల తరువాత అ'పూర్వ' కలయిక


పూర్వవిద్యార్థుల సమ్మేళనం

మార్కాపురం: సుమారు 50 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికకు పట్టణంలోని ఎస్‌వీకేపి కళాశాల వేదికగా మారింది. 1972–75 ఏళ్ల మధ్య ఎస్‌వీకెపి కళాశాలలో బీకాం డిగ్రీ చదివిన విద్యార్థులు 50 ఏళ్ల తరువాత ఆదివారం కలిశారు. జీవితంలో స్థిరపడి ఇన్నేళ్ల తర్వాత ఒకరినొకరు పలకరించుకుని ఆప్యాయంగా యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాడు కళాశాలలో చేసిన అల్లరిని, గోలను గుర్తుచేసుకుని నువ్విలా చేశావంటే... నువ్వలా చేశావంటూ.. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆరోగ్యం ఎలా ఉందంటూ పరామర్శించుకుని మనవళ్లు.. మనవరాళ్ల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. సమావేశానికి నాటి విద్యార్థి, నేటి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సాయిబాబా మందిరం వ్యవస్థాపక కార్యదర్శి గోపాలుని హరిహరరావు అధ్యక్షత వహించి పాత స్నేహితులందరినీ కలిపారు. అప్పటి గురువులైన ఊటుకూరి బాలరత్నం శెట్టి, దేవతి రాములను ఘనంగా సత్కరించి తమ గురుభక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన ఐఎన్‌జీ వైశ్యాబ్యాంకు వైస్ ప్రెసిడెంట్ ఆర్ నారాయణశెట్టి, ప్రముఖ ఆడిటర్ జంకె కృష్ణారెడ్డి, కమర్షియల్ డిప్యూటీ కమిషనర్ ప్రకాష్‌రావు, సర్వేశ్వర భట్టు తదితరులు పాల్గొన్నారు.